గిల్టీఫీలింగ్

"బావుందే నీ చదువు! రోజుకో పెన్సిలు, పుస్తకం ఇలా ఏదో ఒకటి పారవేసుకుంటూ కొత్తవి కొనడం!" అంది పావని చిరాగ్గా.

"నేనేం పారవేయలేదు మమ్మీ! ఇంట్లోనే మర్చిపోయాను. రాయడానికి పెన్సిల్ లేకుండా క్లాసుకు వెళ్తే టీచరు కొడతారు. అందుకని సునీత మేజర్ అంకుల్ షాపులో కొత్త పెన్సిల్ ఇప్పించింది. రేపు డబ్బులు తెచ్చియిచ్చేస్తానని చెప్పేను" అంది మున్నీ.

"ఏం జరిగిందోయ్! మున్నీనెందుకు అలా ప్రతి చిన్న విషయానికి సతాయిస్తావ్!" అన్నాడు అభినవ్ కూతుర్ని కిస్ చేస్తూ.

మున్నీకి ఆరు సంవత్సరాల వయస్సు. లోటస్ కాన్వెంట్‌లో సెకెండ్ క్లాస్ చదువుతోంది. మున్నీ అభినవ్ పావనిల ఏకైక కుమార్తె. అభినవ్ ఆవూరు ట్రాన్స్‌ఫర్ మీద వచ్చి మూడు నెలలైంది.

"ఏం చేసిందో మీ ముద్దులపట్టీనే అడగండి! మీరలా ముద్దు చేయబట్టే అది మాట వినకుండా మొండిగా తయారైంది" అంది భర్తకు కాఫీ కప్పు అందిస్తూ.

"నేనేం తప్పుపని చెయ్యలేదు డాడీ! స్కూల్‌కి పెన్సిల్ తీసుకెళ్లడం మర్చిపోయేను. రాసేందుకు పెన్సిల్ లేకుంటే టీచర్ కొడతారు. అందుకని కొత్త పెన్సిల్ కొనుక్కున్నాను...."

"గుడ్! మంచిపని చేసేవు!" అన్నాడు మెచ్చుకుంటూ.

"మీ అమ్మాయి చేసే ప్రతి పనినీ మీరలా సపోర్ట్ చేయడంవల్లే దానికి నామాటంటే ఖాతరు లేదు. ఉదయం స్కూల్‌కి వెళ్లేముందు స్కూల్‌బేగ్‌లో అన్నీ వున్నాయో లేదో చెక్ చేసుకోమని రోజూ చెప్తున్నాను. స్కూల్‌టైమ్ అయేవరకూ

పక్కమీంచి దిగదు. ఆ తరువాత నేను లేటు చేస్తున్నానని ఒకటే ఉరుకులూ పరుగులూ..."

"అవునోయ్! రాత్రి ఏదో రాయాలని మున్నీ బేగ్‌లోంచి నువ్వు పెన్సిల్ తీసేవుకదా అది తిరిగి బేగ్‌లో పెట్టలేదా?" అన్నాడు కేజువల్‌గా.

పావనికి ఏదో జ్ఞాపకం వచ్చి పద్దు పుస్తకం తెరిచి అందులో మున్నీ పెన్సిల్ చూసి చిన్నబోయింది. రాత్రి పద్దు రాయడానికి పెన్ను కనిపించకపోతే మున్నీ బేగ్‌లోంచి పెన్సిల్ తీసి రాసి దానిని పద్దు పుస్తకంలోనే వుంచేసింది. పావనికి రోజూ యింటి ఖర్చులు పద్దురాయడం అలవాటు. తప్పు చేయడమేగాక అనవసరంగా కూతుర్ని చీవాట్లు వేసినందుకు గిల్టీగా ఫీలైంది.

"అదికాదండీ! మీరు ఎవరివద్దా ఏ వస్తువూ అరువుతేవద్దంటారు. మరి మున్నీ ఈ రోజు మిలట్రీ మేజర్ అంకుల్ షాపులో పెన్సిలు, రెండు రోజుల క్రితం కాపీ రైటింగ్ పుస్తకం... ఇలా రోజుకొకటి అరువు తెస్తోంది"

"ఫర్వాలేదు. డబ్బులు రేపు తీసుకొని వెళ్లి ఇచ్చేయమను. ఆ మేజర్ అంకుల్ ఎవరో మంచివాడు కనుకనే అరువిచ్చేడు. లేకుంటే పిల్లలకు ఎవరూ అరువియ్యరు. తెలుసా!" అని స్నానానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లేడు.

'అవును. అదీ నిజమే! లేకుంటే మున్నీ ఈరోజు టీచర్‌చేత దెబ్బలు తినేది!' అనుకుంది పావని. దెబ్బల విషయం గుర్తు రావడంతో ఆమె మూడ్ ఆఫ్ అయింది. చేదు జ్ఞాపకం ఎన్నాళ్ళయినా ఎన్నేళ్లయినా ఇంకా వెన్నాడుతూనే ఉంది. గిల్టీ ఫీలింగ్ మనసుని వణికిస్తూనే ఉంది.

పావని సెవెన్త్‌క్లాస్ చదువుతున్నప్పుడు జరిగిన సంఘటన-పావని అన్న రాఘవ, బావ అభినవ్, వినోద్ ముగ్గురూ మంచి స్నేహితులు. ముగ్గురూ టెన్త్ పరీక్షకు వెళ్లేరు. వినోద్‌కి చిన్నతనంలోనే తండ్రి పోయేడు. వినోద్ అన్న వినయమ్ ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ కుటుంబ బాధ్యతలు చేపట్టి తమ్ముడిని చదివిస్తున్నాడు. వినోద్ చదువులో ఫస్ట్.

ఆరోజు టెన్త్ రిజల్ట్స్ పేపర్లో వచ్చేయి. వినోద్‌కి స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చింది. ఉదయాన్నే పేపరు చూసిన రాఘవ, అభినవ్ తాము ఫస్ట్‌ర్యాంక్ వచ్చినందుకు ఎంతో సంతోషించేరు. వినోద్ వాళ్లు పేపరు తెప్పించుకోరు. అందువల్ల వినోద్‌కింకా ఈ శుభవార్త తెలియదు కనుక వాడిని చిన్నగ ఆట పట్టిద్దామనుకున్నారు.

రాఘవ పావనిని పిల్చి "చెల్లాయి నువ్వు వినోద్ యింటికి వెళ్లి వాడు పరీక్షలో ఫెయిల్ అయ్యేడని చెప్పు. నమ్మకం లేకుంటే ఈ పేపరు వాడికిచ్చి చూసుకోమను!" అని చెప్పి పంపేడు. పావని తిరిగి వచ్చేక తాము వెళ్లి వాడిని సర్ప్రైజ్ చెయ్యాలనుకున్నారు.

పావని అమాయకంగా పేపరు తీసుకొని వినోద్‌వాళ్ల యింటికి వెళ్లి తలుపు తట్టింది. వినయ్ తలుపుతీసి "ఏం పావనీ ఇంత ఉదయాన్నే వచ్చేవ్" అన్నాడు. "వినోద్ లేడా? వినోద్ పరీక్ష ఫెయిల్ అయ్యేడుట! మా అన్నయ్య, బావ చెప్పమన్నారు వాడికి! నమ్మకం లేకపోతే ఇదుగో పేపరు చూడండి" అంది పావని.

"ఇంకెందుకమ్మా చూడడం! మీరంతా చూసి చెప్తున్నారు చాలు ఇంకా చూసేదేంటి?" అని "వినోద్, వినోద్" అని గర్జించాడు.

వినోద్‌కి గతరాత్రి నుండీ ఒళ్లు నొప్పులు, కొద్దిగా జ్వరం. ఇంకా పక్కమీద నుంచి లేవలేదు. వినయ్ పిలుపు విని త్రుళ్లిపడి లేచి గబగబా వచ్చేడు.

"దొరగారికింకా తెల్లారలేదా! మూడు పూటలా కపునిండా మెక్కడం, పడుకోవడం, ఇంక పనేంవుంది? ఒళ్లు కొవ్వెక్కి చదువు సంతకెళ్లింది" అని బెల్ట్ తీసుకొని తమ్ముడిని ఎడాపెడా చితబాదేడు.

"రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించి పెడుతూంటే చదువు సంధ్యా ఎగ్గొట్టి వూరంట బలాదూర్‌గా తిరగడం!"

వినోద్ సమాధానం చెప్పబోతే మరో నాలుగు దెబ్బలు వేసి వీధిలోనికి నెట్టి

"పోరా పో! పోయి వీధులంట ముష్టెత్తుకుని బ్రతుకు. ఇక నేను నీకు తిండిపెట్టి పోషించలేను" అని భళ్లున తలుపులు మూసేడు వినయ్.

వినోద్‌ని వాళ్లన్న చావకొట్టడం చూసిన పావని భయపడి యింటికి పరుగెత్తుకు వెళ్లి జరిగిన విషయం రాఘవకూ, అభినవ్‌కూ చెప్పింది.

పావని చెప్పిన విషయం విన్న రాఘవ, అభినవ్ షాక్ అయ్యేరు. అలా జరుగుతుందని వారేమాత్రం ఊహించలేకపోయారు. దాంతో భయపడి వారం రోజులు వినోద్ యింటివైపు వెళ్లలేదు. పావనికి జడుపు జ్వరం వచ్చి వారంరోజులు ఒకటే పలవరింతలు. వినోద్ దెబ్బలు తిని ఇల్లు విడిచి వెళ్లిపోయేడన్న విషయం తెల్సుకుని ఎంతో విచారించేరు. తరువాత వినోద్ విషయం వారికి తెలియలేదు.

పావని పసి హృదయంలో ఆ సంఘటన బలంగా నాటుకుంది. అప్పుడప్పుడు ఆమెకు ఆ సంగతులు గుర్తుకొచ్చి కలత చెంది మూడ్ ఆఫ్ అవుతూంటుంది. ఆ కారణానే ఆమె చదువు టెన్త్‌తో ఆపివేసింది. అభినవ్‌తోనే వివాహమైంది.

"ఏం...రోయ్! మళ్లీ మూడ్ ఆఫ్ అయిందా?" అన్నాడు అభినవ్ భార్య పరధ్యాన్నంగా కూర్చుని వుండడం చూసి.

పావని ఉలిక్కిపడి లేచి కిచెన్‌లోనికి వెళ్లింది. అభినవ్ భార్య వెళ్లినవంక చూసి నిట్టూర్పు విడిచేడు.

ఓరోజు పావని పేరంటంలో నిర్మలని కలిసింది. మాటల సందర్భంలో వాళ్ల పిల్లలు, చదువులు, హోంవర్క్ విషయాలు దొర్లేయి.

"నాకు మా సునీతను కూర్చోబెట్టి హోంవర్క్ చేయించడం, చదివించడం పని తప్పిందండీ!" అంది నవ్వుతూ నిర్మల.

"అదేవిటి! వాళ్లడాడీ చదివిస్తారా?"

"అయ్యో రాత! ఆయనకంత ఓపిక ఏదీ! అదంతా ఆ మహా మనీషి! మిలట్రీ మేజర్ అంకుల్ చలువండీ! మావారు రోజూ ఆఫీసుకు వీళ్ల కాన్వెంట్ మీదుగా వెళ్లాలి. వారు ఆఫీసుకు వెళ్తూ సునీతను స్కూలు వద్ద దింపి వెళతారు. స్కూలు నాలుగు గంటలతోసరి.

మావారి ఆఫీసు 5 గంటలవరకూ. సునీత, మరో పదిమంది పిల్లలూ మేజర్ అంకుల్ షాప్‌లో కూర్చుంటారు. పేరెంట్స్ కోసం వెయిట్ చేస్తూ. మేజర్ అంకుల్‌కి పిల్లలంటే ప్రాణం. అతను వారందరినీ కూర్చోపెట్టి వాళ్లచేత హోంవర్క్ చేయించి చదివిస్తాడు. మంచి కథలూ కబుర్లూ చెప్పి వారిని ఎంటర్‌టైన్ చేస్తాడు."

"పాపం! అతనికి నా అన్నవాళ్లెవరూ లేరుట! వార్‌లో అతని కుడికాలు పోతే ఆర్టిఫిషియల్ లెగ్ పెట్టుకున్నాడు. లోటస్ కాన్వెంట్ స్కూల్ కట్టిన స్థలం అతనిదేనట! గవర్నమెంట్ వారతనికి ఇచ్చింది. స్కూల్‌కి డొనేట్ చేసేడు. స్కూల్ గేటు నానుకొని తనో చిన్న డాబాయిల్లు కట్టుకుని అందులో వుంటున్నాడు. స్కూల్ మేనేజింగ్ కమిటీ మెంబర్. అయినా అతను స్కూల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎన్నడూ జోక్యం చేసుకోలేదు. అతను స్కూల్ అవరణలో కాలుపెట్టేది సంవత్సరంలో రెండు పర్యాయాలు. ఆగస్ట్ 15న, జనవరి 26న. ఆరోజున పిల్లలందరికీ చాక్‌లెట్స్ పంచుతాడు"

"పిల్లలకు కావల్సిన స్టేషనరీ సామన్ల షాపు యింట్లోనే పెట్టేడు. అదైనా కాలక్షేపానికి. టైమ్‌పాస్ కోసం! బీద పిల్లలనెందరినో తన డబ్బుతో చదివిస్తున్నాడు. వారికి స్కూల్ ఫీజు, యూనిఫామ్, బుక్స్ వగైరా అంతా అతనే ఇస్తాడు. మావారు కేంప్‌కి వెళ్తే మా సునీతను స్కూల్‌కి నేనే తీసుకొని వెళ్లి, మరలా తీసుకొచ్చేదాన్ని. అప్పుడు అతడినిచూసి మాట్లాడేను. ఎంతో మర్యాదస్తుడు!" అంది నిర్మల.

మేజర్ అంకుల్ గురించి సేకరించిన వివరాలన్నీ భర్తకు చెప్పింది పావని. ఇప్పుడు ఆమెకు మేజర్ అంకుల్ మీద సదభిప్రాయం కల్గింది.

ఈ సంవత్సరం మున్నీ బర్త్‌డే ఘనంగా చేయాలని, బర్త్‌డే పార్టీకి మున్నీ క్లాస్ పిల్లల్ని, టీచర్స్‌ని కూడ పిలవాలనుకున్నారు అభినవ్, పావని.

"మేజర్ అంకుల్ని కూడ పిలుద్దా"మని అంది మున్నీ.

వారు కాదనలేకపోయేరు. మర్నాడు అభినవ్ భార్యను కూతుర్నీ తీసుకొని వెళ్లేడు. స్కూటర్ ఆగగానే మున్నీ పరుగు పరుగున షాప్‌లోనికి వెళ్లి "మేజర్ అంకుల్! మేజర్ అంకుల్! రేపునా బర్త్‌డే. నిన్ను పార్టీకి పిలవడానికి మమ్మీ డాడీ వచ్చేరు!" అంది.

"అల్లాగా" అని మున్నీ చేతిలో ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ బార్ పెట్టి మున్నీ చేయి పట్టుకొని బయటకు రాబోయేడు.

"వినోద్! నువ్వా మేజర్ అంకుల్‌వి" అని అభినవ్ ఆనందం పట్టలేక అతడిని వాటేసుకున్నాడు.

"అభినవ్! ఈవిడ పావని చెల్లాయి కదూ!" అన్నాడు వినోద్.

"అవున్రా! పావనే. మా అమ్మాయి మున్నీ" అన్నాడు అభినవ్.

వారిరువుర్నీ అలా చూస్తూ నిర్ఘాంతపోయింది పావని.

('ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక' జనవరి 2001) ✪